చెన్‌గేశ్‌పూర్ ఈద్గాను సందర్శించిన ఎస్పీ కోఠిరెడ్డి, పోలీస్ సిబ్బంది

నేడు 'ఈద్ ఉల్ ఫితర్' వేడుకలు

ఈద్గాను సందర్శించిన ఎస్పీ కోఠిరెడ్డి

తాండూరు, ఏప్రిల్ 10 : ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను గురువారం నిర్వహించేందుకు జిల్లాలో ముస్లిం ప్రజలు సిద్ధమయ్యారు. ముందు రోజైన బుధవారం తాండూరులోని దుకాణాల్లో సందడి నెలకొంది. కొత్త బట్టలు, టోపీలు, పాదరక్షలు, అత్తర్లు, సుర్మాలు, గాజులు, నోరూరించే సేమియాలు, డ్రైఫ్రూట్స్ తదితర రంజాన్ కొనుగోళ్లతో తాండూరు కిట కిటలాడింది. ఈద్ ఉల్ ఫితర్ పండుగను ఘనంగా జరుపుకొనేందుకు తాండూరు పట్టణంతో పాటు జిల్లాలోని ముస్లింలు ఏర్పాట్లు చేసుకున్నారు.

పండుగ షాపింగ్‌లో ముస్లింలు

తాండూరు పట్టణం చెనిగేశ్‌పూర్ మార్గంలో ఉన్న ఈద్గా వద్ద వేలాది మంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థన చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈద్గాను ఎస్పీ కోఠిరెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సందర్శించారు.అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండుగ చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

ఇబ్రహీంపట్నం : 'దప్పిక తీరేదెలా' అనే శీర్షికతో నమస్తే తెలంగాణలో బుధవారం ప్రచురితమైన కథనానికి అటవీ శాఖ అధికారులు స్పందించారు. దీంతో బుధవారం మధ్యాహ్నం అటవీ శాఖ స్పందించి ఆగాపల్లి, నోముల, గున్‌గల్‌తో పాటు పలు అటవీ ప్రాంతాల్లోని నీటి తొట్లల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపారు.

కడ్తాల్‌లో ఎరువుల రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీత

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీత

కడ్తాల్, ఏప్రిల్ 10 : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువులను విక్రయించాలని.. లేకుంటే సంబంధిత డీలర్ షాప్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీత అన్నారు. మండల కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఈ పాస్ ఆధారంగా ఫెర్టిలైజర్ నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. వ్యాపారులు ఈ పాస్ ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. ఈ పాస్ మిషన్‌లో ఉన్న బ్యాలెన్స్ ఎరువుల ప్రకారం షాపులో ఉండాలని సూచించారు. రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట ఏవో శ్రీలత, డీలర్లు చంద్రశేఖర్, వెంకటేశ్, సుఖేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, మహేశ్ ఉన్నారు.


ఆమనగల్లు : బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌కు అధికంగా ఓట్లు వచ్చేలా చూడాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ నాయకుడు శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎస్సీ ఉప సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు నెలలపాటు ఉచితంగా భోజనం, వసతితో కూడిన కోచింగ్ అందిస్తామని తెలిపారు. కాగా, వంద మందికి అవకాశం ఉందని, ఇందులో 16 మంది అడ్మిషన్ పొందగా.. మిగిలిన 84 సీట్లకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ఉండదనున్నదని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించి ఉండకూడదని, బీఎడ్ ఉత్తీర్ణతతోపాటు టెట్ అర్హులై ఉండాలని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 92931 42542, 99859 59385 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

21న ప్రపంచ సృజనాత్మకత, ఆవిష్కరణ దినోత్సవం

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ నిరంతరం కృషి చేస్తున్నది. తాజాగా ప్రపంచ సృజనాత్మకత, ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 21వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజలు ప్రత్యక్షంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలకు చక్కని పరిష్కార మార్గాలు చూపే ఆవిష్కరణల ఫొటోలను ప్రదర్శించే పోటీలను తీసి పంపించాల్సి ఉంటుంది. ఔత్సాహికులు మొబైల్‌లో ఫొటోగ్రఫీ, డీఎస్ఎల్ఆర్ ఫొటోగ్రఫీ ద్వారా ఆవిష్కరణలను వెతికి తీసి టీఎస్ఐసీకి పంపించాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ లోగా తమ దరఖాస్తులను పంపించాలని, మరిన్ని వివరాలకు (https://t.co/A5 DUHpcnk7)లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

హోమియోపతి విశిష్టతను తెలియజేయాలి

హైకోర్టు జడ్జి సుధ

రామంతాపూర్, ఏప్రిల్ 10 : హోమియోపతి విశిష్టతను మారుమూల ప్రాంతాలకు చేరవేసే బాధ్యత హోమియో విద్యార్థులపై ఉందని తెలంగాణ హైకోర్టు జడ్జి సుధ అన్నారు. బుధవారం రామంతాపూర్ ప్రభుత్వ హోమియో కళాశాలలో హోమియో పితామహుడు సామ్యూల్ హనీమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్న హనీమాన్ విగ్రహానికి జడ్జి సుధ, హోమియో ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 500 మంది వైద్య విద్యార్థులతో హోమియో వాక్ నిర్వహించారు. అనంతరం ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ.. హోమియో సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండటానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ముందుందన్నారు. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా నిధులు తేవడానికి కృషి చేస్తున్నామన్నారు. పిన్సిపాల్ డాక్టర్ లింగరాజు మాట్లాడుతూ.. హోమియో వైద్యం ప్రస్తుతం ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ పార్థసారథి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది రక్తదానం చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి సుధ

కాంగ్రెస్ పార్టీ మాదిగల ద్రోహి

- ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాదిగ
- మాదిగలకు ఒక్క పార్లమెంట్ స్థానం కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీని ఓడిస్తాం
- పార్లమెంట్ సీట్లలో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ తీవ్ర అన్యాయం

శంకర్‌పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 10: పార్లమెంట్ సీట్లలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాదిగ తెలిపారు. పార్లమెంట్ సీట్లలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని బుధవారం శంకర్‌పల్లి ఇంద్రారెడ్డి చౌరస్తాలో ఎమ్మార్పీస్ శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు బండ్లగూడెం శ్రీనివాస్ మాదిగ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ సీట్లలో తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీలకు మూడు సీట్లు ఉంటే.. రాష్ట్రంలోనే అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. దళితుల్లో 20 శాతమున్న మాదిగలకు రెండు సీట్లు కేటాయించి, ఊరుకొక్కరు లేని కులానికి ఒక సీటు ఇచ్చిన ముఖ్యమంత్రి, దళితుల్లో 75 శాతం గల మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో మల్లు కుటుంబానికి, గడ్డం వివేక్ కుటుంబానికి ఉన్న విలువలు మాదిగ జాతికి లేదని, అందుకు కేటాయించిన స్థానాలే సాక్ష్యమని అన్నారు. ఊరికి ఒక్కరు లేని బైండ్ల కులానికి చెందిన శ్రీహరి గారికి ఇవ్వడం చూస్తుంటే అది అర్థం అవుతుందని గుర్తు చేశారు. తెలంగాణలో నాలుగు శాతం జనాభా కలిగిన తమ రెడ్డి కులానికి ఆరు సీట్లను కేటాయించుకున్న ముఖ్యమంత్రి, 12 శాతం జనాభా గల మాదిగలకు స్థానమే లేకుండా చేయడం, 50 శాతం బీసీ జనాభా కలిగినా 2 స్థానాలే కేటాయించి ద్రోహం చేశాడని, కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ ప్రజాప్రభుత్వం కాదని.. రెడ్లు, మాలల ప్రభుత్వమేనన్నారు. మాదిగలకు ద్రోహం చేసిన పార్టీలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయని, కాంగ్రెస్‌కూ అదే గతి పడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాల్లో మాదిగలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శివశంకర్ మాదిగ, నాని, భాను ప్రసాద్ మాదిగ, సీనియర్ నాయకులు నర్సింహులు మాదిగ, ఎంఎస్ఎఫ్ శంకర్‌పల్లి మండల కన్వీనర్ శ్రీకాంత్ మాదిగ, కో కన్వీనర్ మనోజ్, కన్వీనర్ రాజు ఉన్నారు.

తాగునీటి సరఫరాకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం

జిల్లా కలెక్టర్‌లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 10 : తాగు నీటి సరఫరాకు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్టు వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలిసి తాగునీటి సరఫరాపై ప్రణాళిక, వరి ధాన్యం కొనుగోలు, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి తాగునీటి సరఫరా కార్యాచరణ రూపకల్పన చేసినట్టు ఆయన తెలిపారు. వడదెబ్బ తగిలిన వారికి అవసరమైన ప్రథమ చికిత్స సత్వరమే అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ , లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ నారాయణ అమిత్, డీపీవో జయసుధ, డీఈవో రేణుకాదేవి, డీఆర్డీవో శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణాబాయి, డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్, మిషన్ భగీరథ ఈఈలు బాబు శ్రీనివాస్, చల్మారెడ్డి, డీఈలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

రంజాన్ మాసంలో చివరి రోజు కావడంతో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని పలు హోటళ్లలో హలీం కోసం భారీగా తరలివచ్చిన ప్రజలు

నేడే రంజాన్

''శరీరాన్ని కాదు పాపాన్ని శుష్కింపజేసుకోవాలి.. ఆహారాన్నే కాదు అపసవ్య ధోరణులనూ ఆపేయాలి.. మనసును చెడు ఆలోచనలకు దూరంగా ఉంచాలి.. అదే ఉపవాసం.. అలాంటి ప్రార్థనే దైవ సమ్మతం..'' ఇదే రంజాన్ ఇచ్చే సందేశం. నగరంలో గురువారం రంజాన్ వేడుకలు జరుగనున్నాయి. శాంతి పూర్వక వాతావరణంలో రంజాన్ పండుగ నిర్వహించుకోవాలని ముస్లిం మత పెద్దలు సూచించారు. చార్మినార్, సికింద్రాబాద్, బహదూపుర, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో రంజాన్ శోభ సంతరించుకున్నది. గురువారం ముస్లిం సోదరులు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఈ పండుగను పేద, ధనిక తేడా లేకుండా అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకుంటారు. ముస్లింలు తమ ఇంట్లో పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన వివిధ తీపి వంటలను హిందువులు, పేద ప్రజలకు పంపిణీ చేస్తారు. కొత్త బట్టలు ధరించి నమాజ్‌ను చేస్తారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనాలు చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకుంటారు.

- సిటీబ్యూరో, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ)

రంజాన్ వేళ బేగంపేటలోని పాటిగడ్డలో జామియా మసీద్ వద్ద బుధవారం కనిపించిన నెలవంక దృశ్యం

బేగంపేటలోని పాటిగడ్డలో జామియా మసీద్ వద్ద ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

ముఖ్యమంత్రిని కలిసిన డీఎడ్ అభ్యర్థులు

వికారాబాద్, ఏప్రిల్ 10 : 2008 డీఎస్సీలో క్యాలిఫై అయిన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. గతంలో డీఎడ్ 2007 తదితర ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు 2008, డీఎస్సీలో వెలువడిన నోటిఫికేషన్లో ప్రభుత్వ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చారు. కానీ ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు కూడా అవకాశం ఇవ్వాలని అప్పటి ప్రభుత్వాన్ని కోరినా స్పందించలేదన్నారు. దీంతో ప్రైవేట్ అభ్యర్థులమంతా కోర్టును అశ్రయించామని, ఇప్పుడైనా న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరగా.., అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు వెల్లడించారు. సీఎంను కలిసినవారిలో 2008 డీఎస్సీ ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు రఘు, రాంప్రసాద్, కిశోర్, అశోక్, రవి, శ్రీనివాస్, కరుణాకర్, సునీత, అనంతలక్ష్మి, లత ఉన్నారు.

బార్ అసోసియేషన్లు ప్రారంభం

నాంపల్లి కోర్టులు, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన బార్ అసోసియేషన్లను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రావు బుధవారం ప్రారంభించారు. అదేవిధంగా మీసేవ, పోస్ట్ ఆఫీసు, న్యాయవాదుల లంచ్‌హాళ్లు, కక్షిదారులు న్యాయవాదులతో కలిసి మాట్లాడేందుకు నిర్మించిన ప్రత్యేక హాల్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో జస్టిస్ కె.సురేందర్‌రావుతోపాటు జిల్లా జడ్జి ప్రేమావతి, సీబీఐ జడ్జి రమేశ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్రోస్టేషన్‌లో కితాబ్ లవర్స్ బుక్ ఫెయిర్

బుక్ ఫెయిర్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న పాఠకులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లోని సాహిత్య ప్రియులకు ఒక చక్కని అనుభూతిని అందించేందుకు కితాబ్ లవర్స్ బుక్ ఫెయిర్‌తో ఎల్అండ్‌టీ మెట్రో చేతులు కలిపింది. అమీర్‌పేట ఇంటర్‌ఛేంజ్ మెట్రో స్టేషన్‌లోని కాన్‌కోర్స్ లెవల్‌లో పుస్తక ప్రియుల కోసం ప్రత్యేకంగా లైబ్రరీని ఏర్పాటు చేసింది. పుస్తక పఠనానికి ప్రేరణ కలిగించే దిశగా ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు బుక్ ఫెయిర్ ఉంటుందని, అన్ని వయస్సుల వారు ఇష్టపడే నవలలు, జీవిత చరిత్రలు, ఉత్కంఠభరితమైన సాహసాలు, మనస్సుకు హత్తుకునే పిల్లల కథలతో కూడిన పుస్తకాలు ఇందులో ఉంటాయని ఎల్అండ్‌టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని పుస్తక ప్రియులు ఒక్క చోట చేరేందుకు, పుస్తక పఠనాన్ని వేడుకగా జరుపుకొనేందుకు అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో అందరికీ అనువైన ప్రాంతమన్నారు. ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు పొందిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణ సతీశ్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు బుక్ ఫెయిర్ ఉంటుందని ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ మురళీ వరదరాజన్ తెలిపారు.